క్లుప్తంగా

కామాక్షమ్మకు కుంకుమ పూజ



కామాక్షమ్మవారి ఆలయంలో కుంకుమ పూజ చేస్తున్న భక్తులు

సాలూరు: పట్టణంలో కామాక్షమ్మ ఆలయం వార్షికోత్సవం సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని అమ్మవారికి కుంకుమార్చన చేశారు.

నాలుగు గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు



బుడ్డిపేటలో వాటర్‌ట్యాంక్‌ను శుద్ధి చెయ్యిస్తున్న పంచాయతీ పాలకులు

సీతానగరం: మండలంలోని పెదభోగిలి మేజర్ పంచాయతీ పరిధిలో ఉన్న నాలుగు గ్రామాల్లో పంచాయతీ పాలకులు బుధవారం పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. పంచాయతీ పరిధిలోగల బుడ్డిపేట, పెదభోగిలి, సీతానగరం, గూడెం, కాలనీ గ్రామాల్లో భోగితల్లి అమ్మవారి జాతరను పురస్కరించుకుని వేలాది మంది బంధువులు గ్రామాలకు రానున్నారు. వారి సౌకర్యార్థం గ్రామాల్లో తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య పనులు చేపట్టారు.

ఉచిత నేత్ర వైద్యశిబిరం విజయవంతం



నిర్వహిస్తున్న వైద్యశిబిరం

సాలూరు: పట్టణంలోని నవజీవన్ ఆశ్రమంలో బుధవారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్యశిబిరం విజయవంతమైంది. పుష్పగిరి కంటి ఆస్పత్రి వైద్యసిబ్బంది సురేష్, మధులు ఈ సందర్భంగా 83 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. వారిలో 29 మందికి ఆపరేషన్‌లు అవసరమని గుర్తించారు. కార్యక్రమంలో నవజీవన్ చీఫ్ మేనేజర్ ఎస్వీ రమణ, బ్రాంచ్ మేనేజర్ చిక్కాల చిన్నమ్ములు, ఐఆర్‌డీఎస్ చిక్కాల స్వాతి తదితరులు పాల్గొన్నారు.

మట్టిపనులకు అనుకూలం



ఆన్‌లైన్ మస్తరును పరిశీలిస్తున్న ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్

సీతానగరం: ఉపాధి హామీ పథకంద్వారా చేపడుతున్న మట్టి పనులకు అకాలవర్షాల కారణంగా వాతావరణం అనుకూలించడంతో నిర్దేశించిన కొలతల ప్రకారం పనులు చేయాలని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన లచ్చయ్యపేట, అంటిపేట పంచాయతీల్లో జరుగుతున్న పనులను పరిశీలించి ఆన్‌లైన్ మస్తరు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా లచ్చయ్యపేటలో మాట్లాడుతూ వేతనదారులు సమయ పాలన పాటించి, టెక్నికల్ సహాయకులు ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేయడానికి వాతావరణం అనుకూలంగా ఉందన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ సహాయకులు,, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

పాడి రైతులు జాగ్రత్తలు పాటించాలి



మాట్లాడుతున్న పశుసంవర్థక శాఖ ఎ.డి డాక్టర్ సీహెచ్ దీనకుమార్

సీతానగరం: దూడల మరణాల నివారణకు పాడి రైతులు జాగ్రత్తలు పాటించాలని పశుసంవర్థక శాఖ ఎ.డి డాక్టర్ సీహెచ్ దీనకుమార్ సూచించారు. ఈ మేరకు బుధవారం ఆయన మండల పశువైద్య కార్యాలయం (పెదభోగిలి ఆర్బీకే)లో పాడి రైతులకు దూడల మరణాలు నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై పశువిజ్ఞానబడి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆధునిక పద్ధతుల ద్వారా మేలైన పశుసంపదను అభివృద్ధి చేసి వాటి సంరక్షణ, నాణ్యమైన పశు ఉత్పత్తులు పెంచడానికి రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. లేగదూడలు మరణాల శాతాన్ని ఏవిధంగా తగ్గించ వచ్చో సదస్సులో వివరించారు.

ముఖ్యమంత్రికి ఆత్మీయ స్వాగతం







భోగాపురం ఎయిర్‌పోర్టు శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బుధవారం విజయనగరం జిల్లాకు వచ్చిన నేపథ్యంలో పార్వతీపురం మన్యం జిల్లా ప్రజాప్రతినిధులు ఆయనను కలిశారు. ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర ముఖ్యమంత్రిని జగన్‌మోహన్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి మర్యాదపూర్వకంగా ఆహ్వానం పలికారు. అలాగే పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు, ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిని కలిసి ఆత్మీయ స్వాగతం పలికారు.

కామ్రేడ్ శ్రీరామ్మూర్తికి ఘనంగా నివాళి



రెడ్డి శ్రీరామ్మూర్తి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

పార్వతీపురంటౌన్: కమ్యూనిజం బాటలో శ్రామిక రాజ్యం స్థాపన కోసం అలుపెరగని పోరాటాలు చేసిన యోధుడిగా కామ్రేడ్ శ్రీరామ్మూర్తి మంచి పేరు తెచ్చుకున్నారని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కొల్లి గంగునాయుడు కొనియాడారు. ఈ మేరకు బుధవారం స్థానిక గిరిజన సామాజిక భవనంలో శ్రీరామ్మూర్తి రెండవ వర్ధంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడుతూ మన్యం జిల్లాలో కామ్రేడ్‌గా శ్రీరామ్మూర్తి మంచి పేరు తెచ్చుకున్నారన్నారు. ఆయన అడుగుజాడల్లో నడవడమే ఆయనకు మనం ఇచ్చే ఘనమైన నివాళులన్నారు. పట్టణంలో పేదల సమస్యలను పరిష్కరించడంలో ఆయనకు ఒక ప్రత్యేకత ఉందని చెప్పారు. ఆయన లేని లోటు తీరనిదని, ఆయనను అనుసరించిన కామ్రేడ్స్ మాత్రమే ఆ లోటును తీరుస్తారని అభిప్రాయ పడ్డారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ చైర్మన్ యిండుపూరు గున్నేశ్వరరావు, ఐద్వా నాయకురాలు శ్రీదేవి, ఏపీ ఎన్‌జీఓ రాష్ట్ర కార్యదర్శి కిశోర్, జిల్లా కమిటీ సభ్యులు ఎం.తిరుపతిరావు, వై.మన్మథరావు, పి.ఇందిర, కొల్లి సాంబమూర్తి, గొర్లి వెంకటరమణ, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'ఎనీమియా ముక్త భారత్' నిర్వహించాలి



పీహెచ్‌సీలో అందుతున్న సేవలపై ఆరాతీస్తున్న డీఎంహెచ్ఓ జగన్నాథ రావు

- డీఎంహెచ్ఓ జగన్నాథరావు

పార్వతీపురం: ఎనీమియా ముక్త భారత్ ప్రోగ్రామ్‌ను ప్రతి బుధ, శనివారాలు నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. బి.జగన్నాథరావు కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన గరుగుబిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొత్తూరు సచివాలయం పరిధిలో జరుగుతున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రాన్ని, గొట్టివలస సచివాలయం పరిధిలో జరిగిన టీకా కార్యక్రమం పరిశీలించారు. గర్భిణులకు ఉపయోగపడే కిల్కారీ యాప్ గురించి ఆశ వర్కర్లకు ఏ మేరకు అవగాహన ఉందో సమీక్షించారు. ప్రతి ఒక్క ఆశ వర్కరు, సీహెచ్‌డబ్ల్యూ దగ్గర కిల్కారీ నంబర్ ఉండాలని, ఎవరైనా గర్భిణి ఫోన్ ఎత్తకపోతే తిరిగి వారి చేత ఫోన్ చేయించి దాని ద్వారా వచ్చే ఆరోగ్య సూచనలు జాగ్రత్తగా విని పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గర్భిణులు హాస్పిటల్‌లోనే ప్రసవించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఫ్యామిలీ డాక్టర్ విధానంలో భాగంగా ప్రజలందరికీ అవగాహన కల్పించాలని, ముఖ్యంగా రక్తపోటు, మధుమేహంతో బాధపడుతున్న అందరినీ గుర్తించి ప్రతి నెల ఫ్యామిలీ డాక్టర్ శిబిరంలో చూపించి మందులు అందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

ఐరన్ ఫోలిక్ మాత్రలపై అవగాహన

రక్త హీనతతో బాధ పడుతున్న ప్రతి ఒక్క కౌమారదశలో ఉన్న ఆడపిల్లను ప్రతి నెలా పరీక్షించి వారికి ఐరన్ మాత్రలు, పౌష్టికాహారం మీద అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రతి బుధవారం, శనివారం జరిగే అనీమియా ముక్త భారత్ ప్రోగ్రామ్‌లో భాగంగా అవసరమైన ఐరన్ ఫోలిక్ యాసిడ్ సిరప్‌లు ,అలాగే గర్భిణులు, బాలింతలకు మధ్యాహ్న భోజన కార్యక్రమం తరువాత ప్రతి రోజు ఇవ్వాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంబంధిత వైద్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్డీఓ ఆఫీస్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

పార్వతీపురం టౌన్: వర్షాల సందర్భంగా పార్వతీపురం రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు రెవెన్యూ డివిజనల్ అధికారి కె.హేమలత తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన జారీ చేశారు. ఈ కంట్రోల్ రూమ్ బుధవారం నుంచి పనిచేస్తుందని పేర్కొన్నారు. రాత్రి 8గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు ఎం.రమణమూర్తి, బి.సోమయ్య 7382044830, 4వ తేదీ ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఎ.మంగమ్మ, ఎస్. మన్మథరావు 6301921051, రాత్రి 8 నుంచి ఉదయం 8 గంటల వరకు బి.శివరామకృష్ణ, డి.సోమయ్య 9490115460, 5వ తేదీ ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు డి.సుష్మా పట్నాయక్, ఎస్.మన్మథరావు 8317668450, రాత్రి 8 నుంచి ఉదయం 8 గంటల వరకు ఎం.రమణమూర్తి 7382044830, ఆరవ తేదీ ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు సీహెచ్. ఆదిలక్ష్మి 6305110430, రాత్రి 8 నుంచి ఉదయం 8 గంటల వరకు ఎం.విజయ్ కుమార్ 7981675410, 7వ తేదీ ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఎ.మంగమ్మ 6301921051, రాత్రి 8 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు బి.శివరామకృష్ణ, 9490115460 కంట్రోల్ రూమ్‌లో విధులు నిర్వహిస్తారని ఆమె తెలిపారు.

ఉపాధిపనుల పరిశీలన



వేతనదారులతో మాట్లాడుతున్న డ్వామా పీడీ రామచంద్రరావు

మక్కువ: మండలంలోని కొయ్యానపేట గ్రామం సమీపంలో అయ్యప్పచెరువు వద్ద చేస్తున్న ఉపాధిపనిని డ్వామా పీడీ కె.రామచంద్రరావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వేతనదారుల మస్తరును తనిఖీ చేశారు. అనంతరం వేతనదారులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం రూ.272 వేతనం అందిస్తోందని, పనికి తగ్గ వేతనం పొందాలని సూచించారు. ప్రీ మెజర్‌మెంట్ ప్రకారం పనిచేయాలని, పనివేళలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ ఈశ్వరమ్మ, ఈసీ వెంకటలక్ష్మి, టీఏలు పాల్గొన్నారు

భక్తిశ్రద్ధలతో సీతారాముని కల్యాణం

గరుగుబిల్లి: తోటపల్లి శ్రీ కోదండరామస్వామి ఆలయంలో శ్రీ సీతారామస్వామివారి వార్షిక కల్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బుధవారం ఉదయం అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకులకు సుప్రభాతసేవ, ఆరాధన, మంగళాశాసనం, విశ్వక్షేణపూజ, పుణ్యహవాచనం, రుత్విక్‌వరుణ, మృత్యంగ్రహణం, అంకురారోపణం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు వీపీ అప్పలాచార్యులచే శ్రీసీతారామ స్వామి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి అధికంగా దంపతులు పాల్గొని స్వామివారి కళ్యాణాన్ని జరిపించారు. స్వామివారికి, అమ్మవారికి ఉత్సవమూర్తులకు అర్చక స్వాములకు దీక్షా వస్త్రములను, పూజా సామగ్రిని దేవదాయశాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లును నిర్వహించినట్లు ఆలయ సిబ్బంది తెలిపారు.

సంక్షేమ క్యాలెండర్ ఆవిష్కరణ



సంక్షేమ క్యాలెండర్‌ను విడుదల చేస్తున్న మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు

పార్వతీపురంటౌన్: రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్న పథకాల సంక్షేమ క్యాలెండర్‌ను మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు ఆవిష్కరించారు. ఈ మేరకు బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో క్యాలెండర్లను సచివాలయ సిబ్బందికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాల కార్యక్రమంలో భాగంగా వివిధ సంక్షేమ పథకాలు ఏ నెలలో విడుదలవుతాయో క్యాలెండర్ తెలియజేస్తుందన్నారు. సచివాలయ సిబ్బంది విధిగా వార్డు సచివాలయాల్లో ఈ క్యాలెండర్‌ను నోటీసు బోర్డులో ప్రదర్శించాలని స్పష్టం చేశారు. ఏనెలలో ఏ పథకం వస్తుందో వలంటీర్లకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజల సహకారం తప్పనిసరి

- సీఐ కృష్ణారావు



పార్వతీపురం టౌన్: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజల సహకారం తప్పనిసరి అని పట్టణ సీఐ కృష్ణారావు అన్నారు. ఈ మేరకు బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పార్వతీపురం పట్టణంలో తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం ప్రజలందరూ రహదారిభద్రతా నియమాలు పాటించాలని కోరారు. డ్రైవింగ్ లైసెన్స్ లేని వారు వాహనాలు డ్రైవ్ చేయకూడదని హితవు పలికారు. వేసవి సెలవుల కారణంగా టీనేజ్ కుర్రాళ్లు బైక్‌లు నడపాలన్న ఉత్సాహంతో ఉన్నప్పటికీ తల్లిదండ్రులు వారిని అదుపులో ఉంచాలని స్పష్టం చేశారు. మైనర్లు పబ్లిక్ రోడ్డుపై వాహనాలను నడపకుండా ఆపి, ప్రమాదాలను నివారించడానికి సహకరించాలని పిలుపునిచ్చారు. తల్లిదండ్రులు, పెద్దలు, పోలీసు వారు చెప్పే జాగ్రత్తలు పాటించకపోవడం వల్ల ఈ నెల 1వ తేదీన ఒక బాలుడు తన స్నేహితుడి వద్ద రాయల్ ఎన్‌ఫీల్డ్ వాహనం తీసుకుని అజాగ్రత్తగా డ్రైవింగ్ చేస్తూ వాహనాన్ని అదుపు చేయలేక వృద్ధ మహిళను ఢీకొట్టడం వల్ల ఆమె మరుసటి రోజు ఆస్పత్రిలో మృతి చెందినట్లు గుర్తు చేశారు. ఈ ఘటనలో ఇంటర్మీడియట్ విద్యార్థిపై కేసు నమోదు చేయాల్సి వచ్చిందన్నారు.

ఈ కేసు ఉన్నందువల్ల ఆ విద్యార్థి భవిష్యత్ ప్రశ్నార్థకమన్నారు. ఆ వాహన యజమాని అయిన మహిళ తన వాహనాన్ని లైసెన్స్ లేని వ్యక్తికి ఇచ్చి డ్రైవింగ్ చేయించినందున ఆమెను కూడా నిందితురాలిగా పరిగణించామని చెప్పారు. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండి పిల్లలకు వాహనాలు ఇచ్చేముందు గతంలో జరిగిన సంఘటనలు గుర్తు చేసుకుని పిల్లలకు తగిన వయసు, లైసెన్సు పొందే సమయం వరకు వాహనాలు నడపనివ్వకుండా జాగ్రత్త పడాలని హితవు పలికారు.

ప్రతి గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్



బాలగుడబలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి శ్రీకాంత్

పార్వతీపురంటౌన్: మండలంలోని ప్రతి గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ విధానంలో నెలకు రెండుసార్లు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని వైద్యాధికారి శ్రీకాంత్ అన్నారు. ఈ మేరకు బుధవారం బాలగుడబ గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా చిన్నారులు, వృద్ధులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో నెలలో రెండుసార్లు నిర్వహించే ఈ వైద్య శిబిరాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో నిర్వహించే ఈ వైద్యశిబిరంలో వైద్యపరీక్షలను నిర్వహిస్తున్నామని, 62రకాల మందులు అందుబాటులో ఉన్నాయని, రోగికి అవసరమైన మేరకు మందులను అందజేస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో మంచానపడి ఉన్న రోగుల వద్దకు వెళ్లి ఇళ్లవద్దనే వైద్యసేవలను అందిస్తున్నామని చెప్పారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న ఈ ఫ్యామిలీ డాక్టర్ విధానానికి మంచిస్పందన లభిస్తోందని సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, సీహెచ్‌ఓలు, 104 సిబ్బంది, డేటాఎంట్రీ ఆపరేటర్‌లు పాల్గొన్నారు.

గ్రామకంఠం ఆక్రమణలను తొలగించాలి



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఆర్ఐ కె.కరుణాకర్

సీతానగరం: మండలంలోని లక్ష్మీపురంలో సచివాలయం, విలేజ్ క్లినిక్, రైతు భరోసా భవనాల నిర్మాణానికి కేటాయించిన భూమి ఆక్రమణలు జరిగాయా ? లేదా? అనే అంశాన్ని పరిశీలించి తహసీల్దార్‌కు నివేదిక సమర్పిస్తామని ఆర్ఐ కరుణాకర్ అన్నారు. ఈ మేరకు బుధవారం లక్ష్మీపురం ఎంపీటీసీ టి.పార్వతమ్మతో పాటు గ్రామస్తులు తహసీల్దార్‌కు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రభుత్వ కార్యాలయాలు, పేదల గృహాల నిర్మాణానికి గతంలో భూమిని కొనుగోలు చేసిందని, ఇప్పుడా భూమి ఆక్రమణకు గురవుతోందని ఫిర్యాదు చేశారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు గ్రామకంఠం ఆక్రమణకు గురైందా? లేదా? అనే అంశంపై పరిశీలించి నివేదిక సమర్పిస్తామన్నారు. ఉన్నతాధికారులకు అందించిన నివేదిక పరిశీలన అనంతరం చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ భర్త వెంకటరమణ, ఎంపీటీసీ టి పార్వతమ్మ, ఉపసర్పంచ్ సర్పంచ్ వెంకటనాయుడు, వీఆర్వో శ్రీనివాస్, ఇంజినీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

పార్కింగ్ సమస్యను పరిష్కరించాలి



మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న వినియోగదారుల సంఘం సభ్యులు

పార్వతీపురంటౌన్: పట్టణ ప్రధాన రహదారిలో పార్కింగ్ సమస్యను పరిష్కరించాలని వినియోగదారుల సంఘం సభ్యుడు మాన్యం రామకృష్ణ కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్వతీపురం పట్టణంలో రోజురోజుకు వాహనాల రాకపోకలు ఎక్కువవుతున్నాయని, పట్టణంలోని పెద్ద పెద్ద షాపింగ్‌మాల్స్‌కు సైతం పార్కింగ్ లేకపోవడంతో వాహనాలను రోడ్డుపైనే నిలిపివేస్తున్నారని, దీంతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందన్నారు. రోడ్డుపై వాహనాలు నిలపడంతో పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారని, పట్టణంలో పార్కింగ్ సమస్య పరిష్కారానికి మున్సిపల్ అధికారులు చొరవ చూపి పార్కింగ్ ప్రదేశాన్ని కేటాయించేలా షాపింగ్‌మాల్ యాజమాన్యంతో మాట్లాడి పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో వినియోగదారుల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పెండింగ్ చలానాలు తక్షణమే చెల్లించాలి



పెండింగ్ చలానాలపై డ్రైవ్‌లో పాల్గొన్న పోలీసు సిబ్బంది

పార్వతీపురంటౌన్: పెండింగ్ చలానాలు ఉంటే తక్షణమే చెల్లించాలని ట్రాఫిక్ ఎస్సై పాపారావు కోరారు. ఈ మేరకు బుధవారం పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి వద్ద ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పోలీసుశాఖ విధించిన అపరాధ రుసుం పెండింగ్‌లో ఉంటే తక్షణమే చెల్లించాలని చెప్పారు. జిల్లా కేంద్రంలో నెలరోజుల పాటు ఈ డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. చలానా లు చెల్లించని వారి వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. చలానాలు చెల్లించి పోలీసు సిబ్బందికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది సంపత్, కిశోర్, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా విగ్రహ ప్రతిష్ఠ

- హాజరైన విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి
- పూజల్లో పాల్గొన్న టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డి సతీమణి స్వర్ణలతా రెడ్డి, ఎమ్మెల్యే కళావతి



ప్రత్యేక పూజలకు హాజరైన టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి సతీమణి స్వర్ణలతా రెడ్డి, ఎమ్మెల్యే కళావతి

సీతంపేట: సీతంపేటలో నూతనంగా నిర్మించిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో విగ్రహప్రతిష్ఠోత్సవం బుధవారం శాస్త్రోక్తంగా జరిగింది. విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి, టీటీడీ చైర్మెన్ వై.వి.సుబ్బారెడ్డి సతీమణి స్వర్ణలతా రెడ్డి, పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ వేంకటేశ్వరస్వామి, పద్మావతి అమ్మవారు, గోదాదేవి, గరుడాళ్వార్, ద్వారపాలకుల విగ్రహాలకు పవిత్ర జలంతో అభిషేకం చేశారు. యాగశాలలో వైదిక కార్యక్రమాలు, రత్న న్యాసం, ధాతున్యాసం, ఆలయానికి, రాజగోపురానికి విమానకలశస్థాపన, విగ్రహస్థాపన చేశారు. సాయంత్రం పూర్ణాహుతి, చతుర్ధశ కలశస్నపనం, నవకలశస్నపనం, మహాశాంతి, యాగశాల వైదిక కార్యక్రమాలు, విశేషహోమాలు జరిపారు. గురువారం ఉదయం 7.30 నుంచి 8.30 వరకు వృషభలగ్నంలో మహాసంప్రోక్షణ, ఉదయం 10 గంటల నుంచి భక్తులకు స్వామివారి దర్శనం, సాయంత్రం 4 గంటలకు స్వామివారి కళ్యాణం నిర్వహించనున్నట్టు ఆలయ వర్గాలు తెలిపాయి. టీటీడీ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను అలరించాయి. పణుకువలస, గరుగుబిల్లి, లుంబూరు, పాలకొండకు చెందిన భజన బృందాలు భజనలు చేశాయి. పూజా కార్యక్రమాలను ఆలయ సూపరింటెండెంట్ చంద్రమౌళీశ్వర శర్మ, ఆగమ సలహాదారు మోహన్‌రంగాచార్యులు, శేషాచార్యులు, సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, వీజీఓ మనోహర్, డిప్యూటీ ఈఓలు గుణభూషణ్‌రెడ్డి , వెంకటయ్య, శివప్రసాద్ తదితరులు పర్యవేక్షించారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

- ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్



అనసభద్రలో వన్‌ధన్ వికాస్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో విష్ణుచరణ్

సాలూరు: మహిళా సంఘాల సభ్యులు ఆర్థికాభివృద్ధి సాధించాలని ఇన్‌చార్జ్ జాయింట్ కలెక్టర్, ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్ అన్నారు. ఈ మేరకు బుధవారం మండలంలోని పగులుచెన్నేరులో పర్యటించిన ఆయన వన్‌ధన్‌వికాస కేంద్రాలను, పసుపు పంటల సాగు తీరుపై ఆరా తీసి, ప్రాసెసింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అటవీ ఉత్పత్తులు, స్థానికంగా లభించే ఉత్పత్తులను వీడీవీకే (వన్‌ధన్ వికాస్ కేంద్రం)లు సేకరించాలని తెలిపారు. ఈ క్రమంలో ఎటువంటి దళారులను ఆశ్రయించవద్దని సూచించారు. సంఘాల ద్వారా అవసరం మేరకు రుణాలు తీసుకునే వెసులుబాటు ఉందని వివరించారు. పంటల సాగులో, ప్రాసెసింగ్ ప్రక్రియలో రాజీలేకుండా చూసుకోవడం ద్వారా నాణ్యమైన ఉత్పత్తులు పొందవచ్చని స్పష్టం చేశారు. ఆయన వెంట టీపీఎంయూ ఏపీడీ సత్యం నాయుడు, ఏపీఎం గండిపల్లి సింహాచలం, సీసీలు తదితరులు ఉన్నారు.

వన్‌ధన్‌వికాస్ కేంద్రాలతో స్వయం సమృద్ధి

మక్కువ: వన్‌ధన్‌వికాస్ కేంద్రాలతో మహిళలు స్వయం సమృద్ధిసాధించాలని ఐటీడీఏ పీవో విష్ణుచరణ్ కోరారు. మండలంలోని అనసభద్ర గ్రామంలోని జీడిపిక్కల కేంద్రాన్ని, మార్కొండపుట్టి గ్రామంలో పసుపు ప్రాసెసింగ్ కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజన కుటుంబాలకు ఉపాధికల్పనతోపాటు, గిరిజనులు పండించిన అటవీ ఉత్పత్తులు దళారులకు విక్రయించకుండా నేరుగా వన్‌ధన్‌వికాస్ కేంద్రాలకు తరలించేందుకు అవకాశముంటుందన్నారు. దళారులనుంచి, ముందస్తుగా అప్పుగా సొమ్ము తీసుకోవడం వల్ల గిరిజనులు పండించిన అటవీఉత్పత్తులు తక్కువ ధరకే దళారులు కొనుగోలుచేసేందుకు అవకాశముంటుందన్నారు. స్వయం సహాయకసంఘాల సభ్యులతో పీవో ముఖాముఖి మాట్లాడారు. సంఘాల ద్వారా అవసరం మేరకు రుణాలు తీసుకునే వెసులుబాటు ఉందన్నారు. జీడిపప్పుకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉందని, ప్రాసెసింగ్‌లో సరైన చర్యలు చేపట్టి నాణ్యతలో రాజీలేకుండా పనిచేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో టీపీఎంయూ ఏపీడీ వై.సత్యం, ఏపీఎం సన్నిబాబు తదితరులు పాల్గొన్నారు.